RNI NO.APTEL/2006/18110

ప్రతి అక్షరం... ప్రజల పక్షం....

# ప్రజాగళం

తెలుగు దినపత్రిక

నిజామాబాద్ సంపుటి : 20 సంచిక : 299 పబ్లిషర్ : కొక్కురవికుమార్ శనివారం 19 - 9 - 2026 పేజీలు : 4 వెల : రూ. 1 - 00

### నిజాంను ఆదర్శంగా తీసుకుని కాంగ్రెస్, బీఆర్ఎస్ భూదోపిడీ: బీజేపీ

**హైదరాబాద్,సెప్టెంబర్,18:** కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు నిరంకుశ నిజాం పాలకుడిని ఆదర్శంగా తీసుకుంటూ ప్రజాధనాన్ని, భూములను యథేచ్ఛగా దోచుకుంటున్నాయని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ఈ మేరకు ఆయన సోషల్ మీడియా వేదికగా స్పందిస్తూ.. నాడు మాజీ సీఎం కేసీఆర్ నిజాంను ప్రపంచంలోనే అత్యంత ధనవంతుడిగా పేరొందిన నాటి నిజాం తరహాలోనే, తాము కూడా దేశంలోనే అపర కుభేరులుగా ఎదగాలనే ఏకైక దురాశతో కేసీఆర్, రేవంత్ రెడ్డిలు రాష్ట్రాన్ని దోచుకుంటున్నారని ఆయన ఘాటుగా ఆరోపించారు

### నా జీవితం తెరిచిన పుస్తకం.. దగ్గరుండి నా భూములన్నీ చూపిస్తా: హరీశ్ రావు

హైదరాబాద్, సెప్టెంబర్ 18: బీఆర్ఎస్ నేతలు ధరణి పేరుతో భూ కబ్జాలకు పాల్పడ్డారని అసెంబ్లీలో ముఖ్యమంత్రి తీవ్ర ఆరోపణలు చేసిన నేపథ్యంలో అధికారులు తన భూములను తనిఖీ చేయనున్నారన్న అంశంపై మాజీ మంత్రి హరీశ్ రావు మండిపడ్డారు. ఈ మేరకు కాంగ్రెస్ ప్రభుత్వం, నేతలపై ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేశారు. 'నా భూములు చూసేందుకు కాంగ్రెస్ నేతలు వస్తున్నారట. డ్రోన్లు పెట్టి ఫొటోలు తీస్తారట.. ఇవన్నీ ఎందుకు.. నేనిక్కడే ఉన్నా.. నాకు చెబితే అన్ని ఏర్పాట్లు నేనే చేయిస్తా కదా.. దగ్గరుండి నా భూములన్నీ చూపిస్తా.. దాని కోసం వందల మంది పోలీసులు, బుల్లెట్ ప్రూఫ్ బండ్లు ఎందుకు.. నా జీవితం తెరిచిన పుస్తకం.. ఎన్నికల అఫిడవిట్‌లో నా భూములు, ఆస్తుల వివరాలు స్పష్టంగా తెలియజేశా.. మీలా నేను ప్రజల సొమ్ము దోచుకోలేదు.. కబ్జాలు చేయలేదు..' అని హరీశ్ రావు పేర్కొన్నారు.

## గచ్చిబౌలిలో పక్కకు ఒరిగిన నాలుగంతస్తుల భవనం..

**హైదరాబాద్,సెప్టెంబర్,18:** హైదరాబాద్, గచ్చిబౌలి పరిధిలోని గోపన్‌పల్లిలో ఓ నాలుగంతస్తుల భవనం ప్రమాదకరంగా పక్కకు ఒరిగింది. ఈ ఘటన స్థానికంగా తీవ్ర కలకలం సృష్టించింది. భవనం ఏ క్షణంలోనైనా కూలిపోయే అవకాశం ఉండటంతో భయాందోళనకు గురైన స్థానికులు ఇళ్ల నుంచి బయటకు పరుగులు తీశారు. గోపన్‌పల్లిలో కేవలం 50గజాల స్థలంలోనే ఈనాలుగంతస్తుల భవనాన్ని నిర్మించినట్లు తెలుస్తోంది. శుక్రవారం ఉదయం ఈ కట్టడం ఒక్కసారిగా ఒకవైపునకు ఒరిగిపోయింది. సమాచారం అందిన వెంటనే జీహెచ్ఎంసీ అధికారులు ఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు.

భవనం కూలిపోయే ప్రమాదం పొంచి ఉండటంతో అధికారులు దానిని కూల్చివేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ముందుజాగ్రత్త చర్యగా సమీపంలోని ఇళ్లలో నివసిస్తున్న ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించారు. ఈ ఘటనతో గోపన్‌పల్లిలో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. తమ ఇళ్లపై భవనం కూలితే పెను ప్రమాదం సంభవిస్తుందని చుట్టుపక్కల వారు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



## మొదట ఓట్ చోరీ.. ఇప్పుడు పార్టీ చోరీ: రాహుల్ గాంధీ



**న్యూఢిల్లీ,సెప్టెంబర్,18:** భారత ఎన్నికల సంఘం (ఈసీఐ)పై కాంగ్రెస్ ఎంపీ, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ తీవ్ర విమర్శలు చేశారు. పశ్చిమ బెంగాల్‌లో వచ్చే నెల 6న జరగనున్న ఉప ఎన్నికల నేపథ్యంలో తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ) పార్టీ పేరు, పువ్వులు-గడ్డి గుర్తును ఈసీ తాత్కాలికంగా ఫ్రీజ్ చేయడాన్ని ఆయన తప్పుబట్టారు. ఈ మేరకు శుక్రవారం ఎక్స్‌లో ఆయన పోస్టు చేశారు. 'మొదట ఓట్లను చోరీ చేశారు. తర్వాత ప్రభుత్వాలను చోరీ చేశారు. ఇప్పుడు పార్టీని దొంగిలిస్తున్నారు' అని రాహుల్ వ్యాఖ్యానించారు.

దేశంలో ప్రజాస్వామ్యం దిగజారిపోతోందనడానికి తాజా పరిణామాలు నిదర్శనమని ఆయన వ్యాఖ్యానించారు. ముందుగా బీజేపీ, ఎన్నికల సంఘం చేతులు కలుపుతాయని, తర్వాత పార్టీల గుర్తులను తొలగిస్తారని ఆయన మండిపడ్డారు. గతంలో శివసేన, నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ విషయంలోనూ ఇలాగే జరిగిందన్నారు.

ప్రజలు ఇచ్చిన తీర్పును కాపాడాల్సిన రాజ్యాంగబద్ధ బాధ్యత ఎన్నికల సంఘంపై ఉందని, కానీ..అందుకు విరుద్ధంగా ప్రజల తీర్పును మార్చే శక్తులకు ఈసీ సహకరిస్తోందని రాహుల్ విమర్శించారు. స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా ఎన్నికలు జరగాలని కోరుకునే ప్రతి పార్టీ, ప్రతి ఓటరు కోసంతాము పోరాడుతున్నామని పేర్కొన్నారు. కాగాగురువారం రాత్రిజారీ చేసిన మధ్యంతర ఉత్తర్వుల్లో పశ్చిమ బెంగాల్‌లోని నందిగ్రామ్, రెజినగర్ ఉప ఎన్నికల్లో టీఎంసీ పేరు, పువ్వులు-గడ్డి గుర్తును ఉపయోగించరాదని టీఎంసీని ఎన్నికల సంఘం ఆదేశించింది.

## ఫార్ములా ఈ-రేసు కేసు విచారణ అక్టోబర్ 30కి వాయిదా




హైదరాబాద్, సెప్టెంబర్ 18:

ఫార్ములా ఈ కార్ రేసు కేసుకు సంబంధించిన నాంపల్లి ఏసీబీ కోర్టులో మాజీ మంత్రి కేటీఆర్ విచారణ ముగిసింది. తదుపరి విచారణను న్యాయస్థానం అక్టోబర్ 30కి వాయిదా వేసింది.

ఈ సందర్భంగా కేటీఆర్ తరఫున న్యాయవాది మీడియాతో మాట్లాడుతూ.. ఫార్ములా ఈ రేస్ కేసు విచారణను కోర్టు అక్టోబర్ 30కి వాయిదా వేసినట్లు తెలిపారు. ఫార్ములా ఈ రేస్ నిర్వహించిన విదేశీ కంపెనీకి సమన్లు అందలేదన్నారు. దీంతో విచారణను కోర్ట్ వాయిదా వేసిందని చెప్పారు. ఫార్ములా ఈ రేస్ సంస్థకు ఈమెయిల్ ద్వారా సమన్లు పంపించాలని పిటిషన్ వేసినట్లు తెలిపారు. అంతకుముందు తాము వేసిన పిటిషన్ న్యాయస్థానం రిటర్న్ చేసిందన్నారు.

## కేసీఆర్, హరీశ్ రావు భూములపై పూర్తి ఆధారాలు ఉన్నాయి

**- కేసీఆర్ ఓవర్ లాప్ ల్యాండ్‌లో ఉన్నారన్న పొంగులేటి - 2004లో ఒక ఎకరా మాత్రమే చూపించిన కేసీఆర్‌కు వందల కోట్ల భూములు ఎలా వచ్చాయని ప్రశ్న**

**-తమ గురించి మాట్లాడే అర్హత బీఆర్ఎస్ నేతలకు లేదని వ్యాఖ్య**

**హైదరాబాద్,సెప్టెంబర్,18:** బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఓవర్ లాప్ ల్యాండ్‌లో ఉన్నారని, సర్వే అనంతరం వ్యత్యాసాలు బయటపడితే ఆయనకు నోటీసులు ఇస్తామని తెలంగాణ రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. 2004 ఎన్నికల అఫిడవిట్‌లో కేవలం ఒక ఎకరం భూమి మాత్రమే ఉందని చూపించిన కేసీఆర్‌కు వందల కోట్ల విలువైన భూములు ఎక్కడి నుంచి వచ్చాయని నిలదీశారు. తమ భూముల కోసం వచ్చిన దళితులను నిలబెట్టి పసుపు నీళ్లు చల్లించిన చరిత్ర కేసీఆర్ కుటుంబానిదని తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. మాజీ మంత్రి హరీశ్ రావుపై కూడా పొంగులేటి కీలక వ్యాఖ్యలు చేశారు. వట్టినాగులపల్లి భూమిపై హరీశ్ రావు మాటలు మార్చుతున్నారని, ట్రస్ట్ పేరిట భూములను దారి మళ్లించారని ఆరోపించారు. ఇరిగేషన్ మంత్రిగా ఉన్న సమయంలో రంగనాయక్ సాగర్ ఎఫ్టీఎల్ పరిధిలో ఉన్న 13 ఎకరాల భూమిని డిలీట్ చేయించి, అతి తక్కువ ధరకు రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని ఆరోపించారు. రూ. 5.40 కోట్ల ప్రభుత్వ నిధులతో ఆ ల్యాండ్‌కు ప్రయోజనం చేకూరేలా రోడ్డు వేయించుకున్నారని విమర్శించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, తమ వ్యాపార కుటుంబాలపై మాట్లాడే అర్హత బీఆర్ఎస్ నేతలకు లేదన్న మంత్రి, ఈ భూ అక్రమాలకు సహకరించిన అధికారులు ఎంతటివారైనావారిపై కఠిన చర్యలు ఉంటాయని, సిద్దిపేటలో ఆక్రమణకు గురైన భూముల్లో 'ఇందిరమ్మ టవర్స్' నిర్మిస్తామని స్పష్టం చేశారు.



## బెంగాల్ ఉప ఎన్నికల వేళ ఈసీ కీలక నిర్ణయం.. టీఎంసీ చీలిక వర్గాలకు గుర్తుల కేటాయింపు

**కోల్‌కతా,సెప్టెంబర్,18:** పశ్చిమ బెంగాల్ ఉప ఎన్నికల వేళ తృణమూల్ కాంగ్రెస్ పార్టీ గుర్తింపు వివాదంలో ఎన్నికల సంఘం కీలక నిర్ణయం తీసుకుంది. పార్టీ అసలు పేరు, 'పువ్వులు-గడ్డి' చిహ్నాన్ని తాత్కాలికంగా నిలిపివేస్తూ ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వుల నేపథ్యంలో, ఇరు వర్గాలకు కొత్త పేర్లు, ఎన్నికల చిహ్నాలను కేటాయించింది. పార్టీ అధినేత్రి మమతా బెనర్జీనేతృత్వంలోని ప్రధాన వర్గానికి 'మమతా ఆల్ ఇండియా తృణమూల్‌కాంగ్రెస్' పేరును ఖరారుచేస్తూ, ఎన్నికల సంఘం వారికి ఫుట్‌బాల్ ప్లేయర్గు ర్తును కేటాయించింది. అక్టోబర్ 6న జరగనున్న రెజినగర్, నందిగ్రామ్ నియోజకవర్గాల ఉప ఎన్నికల్లో మమతా వర్గ అభ్యర్థులు ఈకొత్త పేరు,చిహ్నంతో బరిలోకి దిగనున్నారు. గతంలో తాము ప్రతిపాదించిన క్రీడా సంబంధిత థీమ్‌కు అనుగుణంగా ఈ గుర్తు లభించింది. తిరుగుబాటు వర్గానికి 'ఎన్వెలప్' సింబల్..మరోవైపు, రితబ్రత బెనర్జీ నేతృత్వంలోని తిరుగుబాటు వర్గానికి ఎన్నికల సంఘం ఎన్వెలప్గుర్తును కేటాయించింది. ఏప్రిల్ అసెంబ్లీ ఎన్నికల తర్వాత మమతా బెనర్జీకి వ్యతిరేకంగాసుమారు 60 మంది ఎమ్మెల్యేల మద్దతుతో వేర్వేరుగా కార్యకలాపాలు సాగిస్తున్న ఈ వర్గానికి ఈసీ ఈ చిహ్నాన్ని కేటాయించడంతో ఎన్నికల బరిలో స్పష్టత వచ్చింది. అక్టోబర్ 6న జరగబోయే ఉప ఎన్నికల్లో ఈ రెండు వర్గాలు వేర్వేరు గుర్తులు, పేర్లతో తలపడుతుండటంతో పశ్చిమ బెంగాల్ రాజకీయాల్లో తీవ్ర ఉత్కంఠ నెలకొంది. అసలు సిసలైన టీఎంసీ వారసులు ఎవరనే దానిపై ఈ ఉప ఎన్నికల ఫలితాలు రాజకీయ భవిష్యత్తును నిర్ణయించనున్నాయి.



## పాకిస్థాన్ మసీదులో దారుణం.. 16 మంది మృతి..

పాకిస్థాన్‌లోని ఖైబర్ పఖ్తుంఖ్వా ప్రావిన్స్, కొహాట్ జిల్లాలోని ఓ మసీదులో శుక్రవారం నమాజ్ సమయంలో సంభవించిన శక్తిమంతమైన ఆత్మాహుతి పేలుడు తీవ్ర కలకలం సృష్టించింది. ఈ దుర్ఘటనలో 16 మంది ప్రాణాలు కోల్పోగా, పదుల సంఖ్యలో భక్తులు తీవ్రంగా గాయపడ్డారు. కొహాట్ జిల్లాలోని ఓల్డ్ పోలీస్ లైన్స్ సమీపంలో ఉన్న మసీదులో శుక్రవారం ప్రార్థనలు (జుమా నమాజ్) జరుగుతుండగా ఈ పేలుడు సంభవించింది. పేలుడు ధాటికి మసీదు భవనంతో పాటు సమీపంలోని భవనాలు, దుకాణాలు దెబ్బతిన్నాయి. సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న దృశ్యాల్లో మసీదు శిథిలాల నుంచి గాయపడిన వారిని రక్షించే దృశ్యాలు కనిపిస్తున్నాయి. ప్రాథమికంగా 8 మంది చనిపోయినట్లు వార్తలు వచ్చినప్పటికీ, తాజా సమాచారం ప్రకారం మృతుల సంఖ్య 16కు చేరింది. వీరిలో ఐదుగురు పోలీసులు కూడా ఉన్నారు. 50 మందికి పైగా గాయపడటంతో సమీపంలోని ఆసుపత్రులకు తరలించారు. 'రెస్క్యూ 1122' సిబ్బంది, పోలీసులు హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. ఈ దాడికి ఇప్పటివరకు ఏ ఉగ్రవాద సంస్థ బాధ్యత వహించలేదు.



## 22ఏ భూములపై సర్కార్ కీలక నిర్ణయం.. సమస్యలకు చెక్ పెట్టేలా హైలెవల్ కమిటీ!

**- ఛైర్మన్‌గా సీసీఎల్ఏ కమిషనర్ లోకేశ్ కుమార్- ఇద్దరు ఉన్నతాధికారులు సభ్యులుగా నియామకం**

**- భూ యజమానుల విజ్ఞప్తుల పరిశీలన- క్షేత్రస్థాయి సమస్యలపై కమిటీ దృష్టి**

**హైదరాబాద్,సెప్టెంబర్,18:** తెలంగాణలో సెక్షన్ 22-ఏ కింద నిషేధిత జాబితాలో ఉన్న భూముల సమస్యలకు చెక్ పెట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఈ జాబితాకు సంబంధించి భూ యజమానులు ఎదుర్కొంటున్న ఇబ్బందులు, పెండింగ్ విజ్ఞప్తులను పరిశీలించి పరిష్కరించేందుకు హైలెవల్ కమిటీని ఏర్పాటు చేసింది. దీనిపై ప్రభుత్వం అధికారిక ఉత్తర్వులు జారీ చేసింది. ముగ్గురు ఉన్నతాధికారులతో ఈ కమిటీని ఏర్పాటు చేశారు. సీసీఎల్ఏ కమిషనర్ లోకేశ్ కుమార్‌ను కమిటీ ఛైర్మన్‌గా నియమించారు. లా సెక్రటరీ పాపిరెడ్డి, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ ఐజీ రాజీవ్ గాంధీ హనుమంతు సభ్యులుగా ఉంటారు. 22-ఏ నిషేధిత భూముల జాబితాలో ఉన్న అంశాలను కమిటీ సమగ్రంగా పరిశీలించనుంది.

భూ యజమానులు ఎదుర్కొంటున్న క్షేత్రస్థాయి సమస్యలు, వారి విజ్ఞప్తులను పరిశీలించి పరిష్కారానికి అవసరమైన కార్యాచరణను రూపొందించనుంది. ఏళ్లుగా నిషేధిత జాబితాలో భూములు ఉండటంతో వాటి క్రయవిక్రయాలు, రిజిస్ట్రేషన్ల విషయంలో పలువురు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం ఏర్పాటు చేసిన కమిటీపై భూ యజమానుల్లో ఆశలు నెలకొన్నాయి. సమస్యలను వేగంగా పరిశీలించి పరిష్కారం చూపే దిశగా కమిటీ పనిచేయనుంది. రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ఈ నిర్ణయాన్ని ప్రకటించగా, తాజాగా ప్రభుత్వం అధికారిక ఉత్తర్వులు జారీ చేసింది.



## నాంపల్లి ఏసీబీ ప్రత్యేక కోర్టుకు హాజరైన కేటీఆర్

### రూ. 55 కోట్లను విదేశీ సంస్థకు బదిలీ చేయడంపై ఏసీబీ అభ్యంతరాలు



**హైదరాబాద్,సెప్టెంబర్,18:** ఫార్ములా ఈ-రేస్ వ్యవహారంలో నమోదైన కేసు విచారణకు సంబంధించి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ హైదరాబాద్‌లోని నాంపల్లి ఏసీబీ ప్రత్యేక కోర్టుకు హాజరయ్యారు. ఆయనతో పాటు ఈ కేసులో అభియోగాలు ఎదుర్కొంటున్న సీనియర్ ఐఏఎస్ అధికారి అర్వింద్ కుమార్, హెచ్ఎండీఏ చీఫ్ ఇంజినీర్ బీఎల్ఎన్ రెడ్డి, స్పోర్ట్స్ కన్సల్టెంట్ కిరణ్ మల్లేశ్వరరావు కూడా న్యాయస్థానం ముందుకు వచ్చారు.

గతంలో హైదరాబాద్‌లో నిర్వహించిన ఫార్ములాఈ-రేస్ కోసం హెచ్ఎండీఏ నిధుల నుంచి సుమారు రూ. 55 కోట్లను విదేశీ సంస్థకు బదిలీ చేయడంపై ఏసీబీ తీవ్ర అభ్యంతరాలు వ్యక్తంచేసింది.

ఎలాంటి ముందస్తు అనుమతులు పొందకుండా, ఆర్థిక నిబంధనలు, ప్రామాణిక విధివిధానాలను ఉల్లంఘించి ఈ నిధులను కేటాయించారనే ఆరోపణలతో దర్యాప్తు సంస్థ చార్జ్‌షీట్ దాఖలు చేసింది. ఏసీబీ సమర్పించిన నివేదికను పరిగణనలోకి తీసుకున్న ప్రత్యేక కోర్టు, నిందితులకు ఇదివరకే సమన్లు జారీ చేసింది. గత విచారణ సమయంలో కేటీఆర్ వ్యక్తిగత కారణాల వల్ల మినహాయింపు కోరగా, విచారణఈనాటికి వాయిదా పడటంతో ఆయన ప్రత్యక్షంగా హాజరయ్యారు.

# సంపాదకీయం

## తోలుబొమ్మలాట కనుమరుగేనా..?

సినిమాలు, టి.వి.లు లేని రోజుల్లో వృత్తి కళాకారుల ప్రదర్శనలకు ప్రజలు బ్రహ్మరథం పట్టేవారు. అలిసిపోయిన పల్లె ప్రజలకు జానపదుల ప్రదర్శనలు సేదతీర్చేవి. గ్రామాల్లో జానపద కళాకారులు వివిధ రకాలైన ప్రదర్శనలు ఇచ్చేవారు. ముందు తరాలవి శ్రమైక జీవన విధానం. కష్టజీవులే ఎక్కువ మంది. రోజంతా కాయకష్టం చేసి ఇళ్లకు చేరిన వారి అలసట తీర్చి వారికి సాంత్వన చేకూర్చే కళా రూపాలే జనపదాలు. అలాంటి వాటిలో తోలు బొమ్మలాట ప్రధానమైనది. తోలు బొమ్మలాట ఒక జానపద కళారూపం. తాను స్వయంగా అనుకరించలేని జానపదుడు కావ్యాల్లోనూ, పురాణాల్లోను వర్ణింపబడిన పాత్రల ఆహార్య విశేషాలను స్వయంగా సృష్టించు కున్నాడు. తన భాషతో ఆ మూగ చిత్రాలకు ప్రాణం పోశాడు. రకరకాల విన్యాసాలను వాటి చేత చేయించాడు. తాను స్వయంగా వెనుకనుండి ఈ పాత్రలను కదిలించాడు. కదులుతున్న ఆ జీవంలేని బొమ్మలతో జీవ నిబద్ధమైన ఒక దృశ్యాన్ని ప్రదర్శించడం లోనే జానపదుడి కళాత్మకత దాగి ఉంది. సుసంపన్న మైన హిందూ ఇతిహాసాలను తెర మీదకి తెచ్చిన ఒక గొప్ప ప్రక్రియ తోలు బొమ్మలాట.ఒక సామూహిక సంగీత, నాట్య ప్రదర్శన కళారూపమైన తోలు బొమ్మలాట, జానపదుని మొదటి రంగస్థల ప్రదర్శన కళారూపాన్ని గుర్తించవచ్చు. పూర్వం రాజాస్థానాల లోని పండితులు తమ ప్రభువులను సంతోష పెట్టడానికి బొమ్మలను తయారు చేసి మానవులుగా నటింపచేస్తే సృజనాత్మకంగా ఉ ంటుందని భావించి తోలు బొమ్మలను తయారుచేసి, తెల్లటి పంచెను తెరగా అమర్చి, దానిపైన దీపం కాంతిలో బొమ్మల నీడలను పడేటట్లు చేసి బొమ్మలాటను ప్రదర్శించేవారు. ఈ విధంగా తోలు బొమ్మలాట పుట్టిందని, ఈ ఆట పండితుల చేత మెరుగులు దిద్దుకున్నదని, చెప్పడానికి అమర కోశం లోని శ్లోకాలను నిదర్శనంగా పేర్కొనవచ్చు. మహా భారతంలో తోలు బొమ్మలాట ప్రస్తావన ఉంది. భగవద్గీతలో సత్త్వ, తమో, రజో గుణాలు మూడు దారాలని, అవి పరమాత్మని చేత మానవ జీవన గమనంలో లాగబడు తుంటాయని చెప్పబడింది. మానవుడు బొమ్మ అయితే అతనికున్న సూత్రాలు ఈ మూడు గుణాలు. ఆడించేవాడు జగన్నాటక సూత్రధారి అన్న అర్థంలో ఉన్న ఈ భాగం తోలు బొమ్మలాటలకు సంబంధించిన ప్రస్తావన. భారతీయ జానపద ప్రదర్శన కళల్లో అతి ప్రాచీనమైన దృశ్య రూపకానికి చెందినది తోలు బొమ్మలాట. క్రీ.పూ 3 వ శతాబ్దం నాటికే తెలుగు దేశంలో తోలు బొమ్మలాట ప్రచారంలో ఉన్నట్లు తెలుస్తోంది. చరిత్రకారుల ప్రకారం తోలు బొమ్మలు క్రీ.పూ 2500 సం.నకు పూర్వం, పురాతన నాగరికత అయిన హరప్పా, మొహంజోదారో కొన్ని వేల కిలోమీటర్ల వరకూ వ్యాపించినట్లు చెపుతారు. క్రీ.పూ 3 వ శతాబ్దానికి చెందిన అశోకుని శిలా శాసనాల్లో జంబూ ద్వీపానికి బొమ్మలాట ప్రదర్శన రంగంగా ఆపాదించారు. పతంజలి మహాభాష్యంలో తన కాలపు వినోద సాధనాలను వివరిస్తూ మూడు ప్రధానమైన వాహికలను వివరిస్తూ వాటిలో బొమ్మలాట ఒక ప్రధనమైన వాహిక అని వివరించారు. తేరి గాథ అను బౌద్ధ గ్రంథంలో బొమ్మలాటకు సంబంధించిన ప్రస్తావన ఉంది. వాత్సాయనుని కామసూత్రాల్లో బొమ్మలలోని రకాలు, బొమ్మలాటల్లోని తేడాలు చర్చింప బడినాయి. కన్యలను ఆకర్షించడానికి బొమ్మలాటల ప్రదర్శన అవసరమని వాత్సాయనుని వివరణ. నాటకానికి, తరువాత పరోక్షంగా తోలుబొమ్మలాట సినిమాకు మూలమైంది. కదలికలోని ఆనందం కనుక్కున్న మనిషి ఆలోచనలో నుండి పుట్టిందే బొమ్మలాట. స్థిరత్వం నుండి చలనం వైపుకు పయనించడంలో భాగంగా ప్రాచీన మానవుడు బొమ్మలాటను సృష్టించు కున్నాడు. కథ చెప్పడం మొదలైన తరువాత ఆ కథలోని పాత్రలు తెరమీద కనిపిస్తే, నటిస్తే చూడాలన్న జనపదుడి తపనలో నుండి బొమ్మలాట పుట్టింది. బొమ్మలతో ఆడుకోవడం అతి ప్రాచీన కళ. కొయ్యబొమ్మ లాటలు, కట్టెబొమ్మ లాటలు, తొడుగు బొమ్మలాటలు, తళ్ళబొమ్మ లాటలు, బుట్టబొమ్మ లాటలు, తోలుబొమ్మ లాటలు అని బొమ్మలాటలు అనేకము ఉన్నాయి. రంగస్థలంపై పొడవాటి గుంజలపై తెల్లటి వస్త్రాన్ని లేదా పంచెను ముందు భాగంలో గట్టిగా లాగి కడతారు. తెర భూమి నుండి నిలువుగా ఉండకుండా కొంచెం ఏటవాలుగా కడతారు. ఈ విధంగా కట్టడం వల్ల బొమ్మలను ఆడించే టప్పుడు బొమ్మలకు కాళ్ళు అడ్డు తగలకుండా ఉంటుంది. తోలు బొమ్మల ప్రతిబింబాలు సరిగ్గా తెరపై పడడానికి తెరలోపలి నుండి పూర్వం కాగడాలు ఉపయోగించేవారు. విద్యుత్ సౌకర్యం అభివృద్ధి చెందిన తర్వాత ఎక్కువ కాంతిని ఇచ్చే విద్యుత్ బల్బులను వాడుతున్నారు. ప్రదర్శన సంబంధమైన కదలికలకు అనుగుణంగా ప్రధాన గాయకుడు పాడుతూ వుంటే, మిగిలిన వారు వంతలుగా పాడుతారు. వంతల్లో స్త్రీలు ప్రధానంగా ఉంటారు. ముఖ్యపాత్ర వహిస్తుంది. స్త్రీ పాత్రలకు స్త్రీలే పాడతారు. తోలు బొమ్మలాటలో సామాజిక స్థితిగతులకు దర్పణంగా నిలిపి, పాత్రల ద్వారా సమాజంలో ఉండే దురాచారాలను, మూఢ నమ్మకాలను ఎండగడతారు. మొదలైనవి చోటు చేసుకుంటాయి. అదేవిధంగా అభినయాలకు స్వభావానుగుణంగా తేల్చడానికి వాద్యానికి సంబంధించి హార్మోనియం, తాళాలు, తొక్కుడుబిళ్ల, మద్దెల, డప్పు, గజ్జెలు వంటివి ప్రధాన భూమికను నిర్వహిస్తాయి. తోలు బొమ్మల ప్రదర్శనలో రామాయణం, భార తం లకు సంబంధించిన కథా వస్తువులు ఉంటాయి. లంకా దహనం, సతీసులోచన, యయాతి, అంగద రాయబారం, మైరావణ వధ, విరాటపర్వం, పద్మవ్యూహం, ఉత్తర గోగ్రహణం వంటి కథలతో తోలు బొమ్మలను ప్రదర్శిస్తారు. తోలు బొమ్మలు ఆంధ్ర రాష్ట్రంలో ప్రాచీన ఓడరేవులైన కళింగపట్నం, భీమునిపట్నం, కోరంగి, మచిలీపట్నం, వాడరేవు, కొత్తపట్నాల నుంచి విదేశాలకు భారతీయులతో పాటు వెళ్ళాయి. పర్షియా, టర్కీ ల మీదుగా గ్రీసు దేశంలో ప్రవేశించిన తోలుబొమ్మలు, గ్రీసులో నూతన రూపం సంతరించుకుని ఉత్తరాఫ్రికా లోని ముస్లిం దేశాలకు, 17వ శతాబ్దంలో ఇటలీకి, అక్కడినుండి ఫ్రాన్స్ లోని వెర్సయి ల్స్, పారిస్, పేలేరాయల్ నగరాలకు వ్యాపించాయి.

**పబ్లిషర్ : కొక్కు రవికుమార్**

# దేశాభివృద్ధిలో దక్షిణాది రాష్ట్రాలు కీలకం...



చెన్నై : దేశాభివృద్ధిలో దక్షిణ భారత్ అత్యంత కీలక ప్రాంతమని కేంద్ర హోం, సహకార శాఖల మంత్రి అమిత్ షా చెప్పారు. సదరన్ జోనల్ కౌన్సిల్ సమావేశంలో ఆయన ప్రసంగిస్తూ సాహిత్యం, పరిశోధన-అభివృద్ధి, అంతరిక్షం, ఐటీ, ఏఐ, పారిశ్రామికాభివృద్ధి, వ్యవసాయం..ఇలా అన్ని రంగాలలోనూ దక్షిణ ప్రాంతం సహకా రాన్ని అందిస్తోందని కొనియాడారు. ఐటీ, ఆటోమొబైల్, ఫార్మా రంగాలు, మౌలిక సాదుపాయాల అభివృద్ధిలో దక్షిణ భారతదేశం కీలక పాత్ర పోషించిందని, అందుకే ఈ ప్రాంతానికి పెద్ద ఎత్తున విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు వచ్చాయని తెలిపారు.

దేశాభివృద్ధిలో దక్షిణ భారత్‌ను అతి పెద్ద భాగస్వామిగా నిలిపేందుకు అధిక అక్షరాస్యతా రేటు, నైపుణ్యం కలిగిన మానవ వనరులు, లోతైన సముద్ర వనరుల వినియోగంలో సాంకేతికత ఉపకరించాయని వివరించారు. ఆవిష్కరణలు, ఆదాయ వనరుల పెంపు రంగాలలో భారతదేశం దక్షిణాది నుంచి స్ఫూర్తి పొందాలని అన్నారు. 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా ప్రధాని మోడీ చేసిన ప్రసంగాన్ని అమిత్ షా ప్రస్తావించారు.

ప్రపంచ దేశాలతో పోటీ పడి భారత్ అభివృద్ధి సాధించాలంటే ప్రతి రాష్ట్రం తన వంతు సహకారాన్ని అందించాలని కోరారు. ప్రాంతీయ మండలిని ఓ అర్థవంతమైన వేదికగా మార్చేందుకు 2014 నుంచి కృషి జరుగుతోందని చెప్పారు. గతంలో ఏడాదికి సగటున రెండున్నర సమావేశాలు మాత్రమే జరిగేవని, ఇప్పుడు ఆరు జరుగుతున్నాయని తెలిపారు. వీటిలో సుమారు 80 శాతం సమస్యలు పరిష్కారమయ్యాయని చెప్పుకొచ్చారు. అరవై సంవత్సరాలుగా అపరిష్కృతంగా ఉన్న సమస్యలు కూడా పరిష్కారమయ్యాయని అన్నారు. దక్షిణాది రాష్ట్రాలు దేశ పురోగతికి మూలస్తంభాలనీ, వాటి అభివృద్ధి నీటి లభ్యత పైనే ఆధారపడి ఉంటుందని చెప్పారు. నీటి పంపిణీలో ఏ రాష్ట్రమైనా తన ప్రయోజనాలు కాపాడుకోవడంలో తప్పు లేదని, అయితే నీరు వృథాగా సముద్రంలో కలసిపోతున్నా రాష్ట్రాలు మాత్రం సంవత్సరాల తరబడి నీటి కొరతను ఎదుర్కొంటున్నాయని, దీనివల్ల ప్రయోజనం ఏముంటుందని అమిత్ షా ప్రశ్నించారు.

## అమెరికా-దక్షిణ కొరియా సైనిక విన్యాసాలపై ఉత్తర కొరియా ఆగ్రహం




అమెరికా, దక్షిణ కొరియా సంయుక్త సైనిక విన్యాసాల వ్యవధి, పరిమాణాన్ని తగ్గించినా వాటి స్వభావంలో ఎలాంటి మార్పు లేదని ఉత్తర కొరియా స్పష్టం చేసింది. ఈ విన్యాసాలు ఇప్పటికీ "రెచ్చగొట్టేవి, దూకుడైనవే" అని ఉత్తర కొరియా అధినేత కిమ్ జోంగ్ ఉన్ సోదరి కిమ్ యో జోంగ్ వ్యాఖ్యానించారు. ఉత్తర కొరియాను "శత్రుత్వపూరితంగా" భావించే సైనిక విన్యాసాలను తగ్గించాలని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఆదేశించిన నేపథ్యంలో కిమ్ యో జోంగ్ ఈ వ్యాఖ్యలు చేశారు. కిమ్ జోంగ్ ఉన్‌తో తనకు ఉన్న సత్సంబంధాలను దృష్టిలో ఉంచుకుని ఈ నిర్ణయం తీసుకున్నట్లు ట్రంప్ పేర్కొన్నారు. అయితే, అమెరికా తీసుకున్న ఈ చర్యను ఉత్తర కొరియా సద్భావన చర్యగా పరిగణించలేమని, విన్యాసాల వ్యవధి, పరిమాణాన్ని తగ్గించినంత మాత్రాన వాటి "రెచ్చగొట్టే, దూకుడు స్వభావం మారదు" అని కిమ్ యో జోంగ్ స్పష్టం చేశారు. అమెరికాతో ఇటీవలి కాలంలో కిమ్ జోంగ్ ఉన్‌కు ఎలాంటి సంప్రదింపులు జరిగాయో తనకు తెలియదని కూడా ఆమె తెలిపారు. అయితే ఉత్తరకొరియా 120 వరకు అణ్వాయుధాలను కలిగి ఉందని దక్ష?ణ కొరియా రక్షణమంత్రి ప్రకటించారు. అమెరికా ప్రకటించిన వాటి కంటే అధిక సంఖ్యలో ఉన్నట్లు తెలిపారు. ఉత్తర కొరియా సుమారు 80 నుండి 120 మధ్య అణ్వాయుధాలను కలిగి ఉన్నట్లు భావిస్తున్నామని, కానీ ఖచ్చితమైన సంఖ్యను వెల్లడించలేమని రక్షణమంత్రి అన్ గ్యు-బాక్ పార్లమెంటరీ కమిటీకి వెల్లడించారు. ప్రైవేట్ పరిశోధనా సంస్థల అంచనా ఆధారంగా ఈ సంఖ్యను వెల్లడించామని ఆయన స్పష్టం చేశారు. అయితే ఈ వివరాలను దక్ష?ణ కొరియా సైన్యం అధికారికంగా నిర్ధారించాల్సి వుందని అన్నారు.

## ప్రజాసేవలో ఎల్లప్పుడూ మీ వెంట...కౌన్సిలర్ రాజుల దేవి పవన్ కుమార్ స్పష్టం....



**బోధన్ ప్రతినిధి,సెప్టెంబర్ 18:** (ప్రజా గళం)బోధన్ పట్టణంలోని 29వ వార్డు పరిధిలో ఎస్ఐఆర్ నోటీసులు అందుకున్న ఓటర్ల సమస్యల పరిష్కారం కోసం,గంగపుత్ర సంఘం భవనంలో తహసీల్దార్ కార్యాలయ అధికారుల ఆధ్వర్యంలో శుక్రవారం ప్రత్యేక హియరింగ్ కార్యక్రమం నిర్వహించారు.అధికారులతో సమన్వయం చేసుకుంటూ,ప్రజలకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా,ఈ ప్రక్రియలో వారికి నా వంతు సహాయసహకారాలు అందించడం ఎంతో సంతృప్తిని,అదృష్టాన్ని ఇచ్చింది అని కౌన్సిలర్ రాజులదేవి పవన్ కుమార్ తెలిపారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ,వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయడమే నా ప్రథమ కర్తవ్యం అని కౌన్సిలర్ స్పష్టం చేశారు.

## భారతీయులున్న కార్గో నౌకను హైజాక్ చేసిన దొంగలు



తుర్కియే నుంచి సోమాలియా రాజధాని మొగడిషూలోని మిలిటరీ శిక్షణా కేంద్రానికి ఆయుధాలు, కమ్యూనికేషన్ మరియు శాటిలైట్ పరికరాలను తీసుకెళ్తున్న 'లుటుఫ్' అనే సరుకు రవాణా నౌకను సోమాలియా సముద్రపు దొంగలు తమ ఆధీనంలోకి తీసుకున్నారు. కామెరూన్ పతాకంతో ప్రయాణిస్తున్న

ఈ చిన్న నౌకను పుంట్‌లాండ్ తీరప్రాంతంలో సుమారు ఎనిమిది మంది ఆయుధధారులైన దొంగలు హైజాక్ చేసినట్లు సమాచారం అందుతోంది. ఈ నౌకలో మొత్తం 10 మంది సిబ్బంది ప్రయాణిస్తుండగా, వారిలో ఆరుగురు భారతీయులు ఉన్నారు.


మిగిలిన వారిలో ఒక తుర్కియే జాతీయుడు, ఒక జార్జియా పౌరుడు మరియు ఇద్దరు సెర్బియాకు చెందిన భద్రతా సిబ్బంది ఉన్నారు. ప్రస్తుతం ఓడలోని ప్రయాణికులు మరియు సరుకు భద్రతపై తీవ్ర ఆందోళన వ్యక్తమవుతోంది. నౌక స్వాధీనం తర్వాత చోటుచేసుకున్న పరిణామాలు మరింత ఉత్కంఠను రేపుతున్నాయి. సంఘటన స్థలంలో స్థానిక మత్తు పదార్థమైన 'ఖత్' చేరవేసేందుకు ఒక చిన్న పడవ నౌక వద్దకు వచ్చి వెళ్లిన కాసేపటికే, ఆ సమీప తీరప్రాంతంలో వైమానిక దాడి జరిగింది. ఈ దాడిలో నలుగురు మరణించగా ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. అయితే, ఈ వైమానిక దాడిని ఏ దళాలు నిర్వహించాయనే దానిపై ఇంకా అధికారిక స్పష్టత రాలేదు. తుర్కియే సైనిక హెలికాప్టర్లు మరియు డ్రోన్లు ఈ ప్రాంతంలో పరిస్థితిని నిరంతరం పర్యవేక్షిస్తున్నాయి. దర్యాప్తు సంస్థలు మరియు అంతర్జాతీయ నౌకాదళం ఈ ఘటనపై వేగంగా విచారణ జరుపుతున్నాయి.

## గణేష్ నిమజ్జనంకు వెళ్లే రహదారిపై మొరంతో మర మ్మాత్తు పనులు చేపట్టిన కౌన్సిలర్ అబ్దుల్ మన్నాన్ సమీనా....



**బోధన్ ప్రతినిధి,సెప్టెంబర్ 18:** (ప్రజా గళం)బోధన్ పట్టణ మున్సిపాలిటీ పరిధిలోని 4వ వార్డులో గణపతి నవరాత్రి ఉత్సవాల సందర్భంగా గణపతి రథం వెళ్లేందుకు అవసరమైన దారిని ముందస్తుగా వార్డు కౌన్సిలర్ అబ్దుల్ మన్నాన్ సమీనా మొరం తో మరమ్మాత్తు చేయించారు. ఈ సందర్బంగా రథోత్సవా నికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రత్యేక శ్రద్ధ తీసు కుని ఏర్పాట్లు చేయించిన 4వ వార్డు కౌన్సిలర్ అబ్దుల్ మన్నాన్ సమీనా కు కాలనీవాసులు,భక్తులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఉత్సవాలు ప్రశాంతంగా,భక్తి శ్రద్ధలతో నిర్వహించేందుకు సహకరిస్తున్న కౌన్సిలర్‌కు స్థానికులు అభినందనలు తెలిపారు.

## బార్ కౌన్సిల్ ఎదుట లా విద్యార్థుల ధర్నా...



న్యూఢిల్లీ: నల్సార్ లా విద్యార్థులు ఢిల్లీలోని బార్ కౌన్సిల్ ఆఫీస్ ఎదుట ఆందోళన చేపట్టారు. బీసీఐ చైర్మన్ మానన్ కుమార్ మిశ్రా రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల ఆందోళన నేపథ్యంలో భారీగా పోలీస్ బలగాలు మోహరించాయి.


ఆల్ ఇండియా యంగ్ అడ్వకేట్స్ అసోసియేషన్ పిలుపు మేరకు, కాక్రోచ్ జనతా పార్టీ మద్దతుతో ఈ కార్యక్రమం జరిగింది. నిరసనకారులు మిశ్రా రాజీనామా చేయాలని, జవాబుదారీతనం కోరుతూ నినాదాలు చేస్తూ, ప్లకార్డులు ప్రదర్శించారు. ఇటీవలి నల్సార్ యూనివర్సిటీ స్నాతకోత్సవానికి సీజేఐ సూర్యకాంత్‌ను ఆహ్వానించడంపై విద్యార్థులు అసంతృప్తి వ్యక్తం చేశారు. ఆయన రాకను వ్యతిరేకిస్తూ వర్సిటీ అధికారులకు లేఖలు రాశారు. ఈ నేపథ్యంలో, హైదరాబాద్‌లోని నల్సార్ విశ్వవిద్యాలయం- 2026 గ్రాడ్యుయేటింగ్ బ్యాచ్‌ను నమోదు చేసుకోవద్దని ఆగస్టు 13న బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (బీసీఐ) రాష్ట్ర బార్ కౌన్సిళ్లను ఆదేశించడంతో ఈ వివాదం మొదలైంది. తీవ్ర విమర్శలు రావడంతో ఈ నిర్ణయాన్ని బార్ కౌన్సిల్ ఉపసంహరించుకుంది.

## పాకిస్తాన్ మాజీ ప్రధాని ఇమ్రాన్ ఖాన్ ఆస్పత్రికి తరలింపు



పాకిస్తాన్ మాజీ ప్రధాని ఇమ్రాన్‌ఖాన్‌ను వైద్య పరీక్షల నిమిత్తం శుక్రవారం తెల్లవారుజామున ఆస్పతికి తరలించినట్లు ఆయన పార్టీ పాకిస్తాన్ తెహ్రీక్-ఇ-ఇన్సాఫ్ (పిటిఐ) తెలిపింది. సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశాల మేరకు మాజీ ప్రధాని ఇమ్రాన్‌ఖాన్‌ను అడియాలా జైలు నుండి ఇస్లామాబాద్‌లోని షిఫా ఇంటర్నేషనల్ ఆస్పత్రికి తరలించారని పిటిఐ జర్నలిస్టులకు పంపిన సందేశంలో పేర్కొంది. మూడేళ్లకు పైగా జైలులో ఉన్న ఇమ్రాన్‌ఖాన్ ఆరోగ్యం క్షీణించిందని ఆయన కుటుంబసభ్యులు, మద్దతుదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్న సంగతి తెలిసిందే. జైలులో ఆయన ఆరోగ్యం క్షీణించిందని, కుడి కంటి చూపు గణనీయంగా తగ్గిందని ఆయన న్యాయవాదులు చెబుతున్నారు. అయితే, తక్షణ చికిత్స అవసరమయ్యే అనారోగ్య సమస్యలేవీ వైద్య నివేదికల్లో వెల్లడి కాలేదని ప్రభుత్వం తెలిపింది.

## ఢిల్లీలో విద్యార్థులపై దాడి విచారణకు సుప్రీం కమిటీ..



న్యూఢిల్లీ: ఢిల్లీలోని సీజేపీ ఆధ్వర్యంలో గత నెల 20న జరిగిన పార్లమెంట్ మార్చ్ లో విద్యార్థులపై పోలీసులు, భద్రతా దళాలు జరిపిన దమన కాండపై సుప్రీంకోర్టు కీలక నిర్ణయం తీసుకుంది. దీనిపై విచారించేందుకు ఐదుగురు సభ్యులతో కూడిన స్వతంత్ర కమిటీని సుప్రీంకోర్టు ఏర్పాటు చేసింది. ఈ కమిటీకి సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ ఆర్ సుభాశ్ రెడ్డి అధ్యక్షత వహించగా, పంజాబ్-హర్యానా హైకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రవి శంకర్ ఝా, ఢిల్లీ హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ షాలిందర్ కౌర్, సీబీఐ మాజీ డైరెక్టర్ రిషి కుమార్ శుక్లా, మేఘాలయ రిటైర్డ్ డీజీపీ ఎల్‌ఆర్ బిష్ణోయ్ సభ్యులుగా ఉంటారు. విద్యార్థుల నిరసన సందర్భంగా వారిపై జరిగిన లాఠీఛార్జి, ఎలక్ట్రిక్ బ్యాటన్ల ప్రయోగం, పెల్లెట్ల వినియోగం, టియర్ గ్యాస్ ప్రయోగం వంటి అంశాలపై ఈ కమిటీ విచారణ జరుపుతుంది. సరైన హెచ్చరికలు లేకుండానే విద్యార్థులపై వీటిని ప్రయోగించినట్టు ఆరోపణలున్నాయి. ఇదే సమయంలో నిఘా పేరుతో విద్యార్థుల గోప్యతకు భంగం కలిగిందా లేదా అనే విషయాన్ని కూడా కమిటీ పరిశీలిస్తుంది. అలాగే, నిరసన సందర్భంగా జరిగిన హింస, దాడులు, వేధింపులు, లైంగికపరమైన దాడులపై కూడా కమిటీ విచారణ జరుపుతుంది.

# బీసీ కులాల జనాభాను తక్కువ చేసి చూపే కుట్ర

**- జనగణనలో బీసీ ఉప కులాలను కూడా కలిపి లెక్కించాలి - కుల గణనకు నాలుగు నెలల సమయం ఉంది.. కేంద్రం వెంటనే నిర్ణయం తీసుకోవాలి - తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత**



**నిజామాబాద్ సెప్టెంబర్ 18 (ప్రజాగళం ప్రతినిధి )**బీసీ కులాల జనాభాను తక్కువగా చూపి...వారు ఐక్యంగా పోరాడకుండా కేంద్ర ప్రభుత్వం రాజకీయ కుట్ర చేస్తోందని తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత అన్నారు. జనగణనలో ఓబీసీ కాలాన్ని కులాల వారీగా చూపకుండా బలహీన వర్గాలను కులాల సమూహాలుగా విడగొట్టి ఐక్య పోరాటాలు జరగకుండా ప్రయత్నాలు చేస్తోందన్నారు. బంజారాహిల్స్ లోని ఓ హోటల్ లో శుక్రవారం ది యునైటెడ్ ఫోరం ఫర్ ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయిస్, సకల జన సేవా సంస్థాన్ ఆధ్వర్యంలో నిర్వహించిన “పాలిటిక్స్ బియాండ్ క్యాస్ట్” సదస్సులో కవిత పాల్గొన్నారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ కేంద్రం చేపట్టే కుల గణనలో బీసీ జనాభా విషయంలో ఎలాంటి గందరగోళం లేకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. కేవలం క్యాస్ట్ కాలం పెట్టేసి చేతులు దులుపుకుంటామంటే ఊరుకునేది లేదన్నారు. ప్రతి రాష్ట్రంలో ఉన్న కులాల జాబితాను కచ్చితంగా అప్ లోడ్ చేయాలని...అదే విధంగా ఉపకులాలను కూడా కలిపి లెక్కించాలి. లేదంటే బీసీల జనాభా తక్కువగా కనిపించే ప్రమాదం ఉందని హెచ్చరించారు. ఒకే కులానికి సంబంధించి దేశంలో ఒక్కో రాష్ట్రంలో ఒక్కో స్టేటస్ ఉందని...ఆ సమస్యను పరిష్కరించాలంటే బీసీ కులాల ఉపకులాలను కూడా కలిపి లెక్కించటం జరగాలన్నారు. లేదంటే ఉప కులాల్లో ఉండే వారికి న్యాయం జరగదని వారిని కూడా ఒక కులంగా లెక్కల్లో చూపే ముప్పు ఉంటుందని చెప్పారు. ఇప్పటికే ఎస్సీ, ఎస్టీ లో ఉన్న 57 ఉపకులాల కారణంగా ఉప కులాల్లో వారికి న్యాయం జరగటం లేదన్న విషయం అందరికీ తెలిసిందేనని చెప్పారు. అయినప్పటికీ వేల కోట్లు ఖర్చు చేస్తూ బీసీ జన గణనలో కూడా సొలుష్యన్ లేకుండా చేయటం సరికాదన్నారు. ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం కుల గణన పేరుతో బీసీ జనాభాను తక్కువ చేసి చూపిందని కవిత చెప్పారు. కేంద్రం చేపట్టే కుల గణన ద్వారా ఆ సమస్య తీరుతుందని భావిస్తే...వాళ్లు సమస్యను మరింత జఠిలం చేస్తున్నారని మండిపడ్డారు. కుల గణనకు సంబంధించి మరో నాలుగు నెలల సమయం ఉందని...ఈ లోగా కేంద్రం ఈ సమస్య పరిష్కరించటంపై దృష్టి సారించాలన్నారు.

**మన డీఎన్ఏ లోనే కుల వివక్ష.**

కుల వివక్ష అనేది మన డీఎన్ఏ లోనే పాతుకుపోయిందని కవిత ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రపతి, స్పీకర్ లాంటి వాళ్లు కూడా కుల వివక్ష కు గురికావటం అన్యాయమన్నారు. ఈ జఠిలమైన సమస్యకు మల్టీ డైమన్షన్ సొలుష్యన్స్ అవసరమన్నారు. ఈ సమస్యకు అప్పర్




క్యాస్ట్, బాధితుడు అనే రెండు కోణాలున్నాయని...

బాధితుడి కోణం నుంచి చూసినప్పుడు మాత్రమే సరైన పరిష్కారం లభిస్తుందని చెప్పారు. మారోజు వీరన్న చెప్పినట్లుగా ప్రతి కులాన్ని ఎంపావర్ చేయాల్సిన అవసరముం దన్నారు. రాజ్యాధికారంతో పాటు ఆర్థికంగా ఆయా కులాలను బాగు చేయాలని...అధికారంలో ఉన్న పార్టీలే ఆ బాధ్యత తీసుకోవాలని చెప్పారు. చట్టాల పరంగా ఎన్ని చర్యలు చేపట్టినప్పటికీ ఆలోచన విధానంలో మార్పు వచ్చినప్పుడే కుల వివక్ష నిర్మూలన సాధ్యమవుతుందని అన్నారు.పురుషులతో సమానంగా పనిచేసినప్పటికీ మహిళలకు వేతనాల్లో వ్యత్యాసం చూపించటం అన్యాయమని కవిత ఆవేదన వ్యక్తం చేశారు.సమాన పనికి సమాన వేతన చట్టాలు ఉన్నప్పటికీ. 2026లో కూడా వేతన వ్యత్యాసం చూపుతున్నారన్నారు. శుక్రవారం అంతర్జాతీయ సమాన వేతన దినోత్సవం సందర్భంగా ఈ అంశంపై ఎక్స్‌లో ట్వీట్ చేశారు. మహిళల శ్రమకు సమానమైన విలువ ఇచ్చినప్పుడు మాత్రమే నిజమైన పురోగతి సాధ్యమవుతుందన్నారు.

## ప్రజల మధ్య,ప్రజల కోసం,ప్రజాసేవలో మరో అడుగు!..

**గణేష్ మండలి వద్ద అన్నప్రసాద వితరణ చేసిన కౌన్సి లర్ అబ్దుల్ సమీనా మన్నాన్...**



**బోధన్(ప్రతినిధి,సెప్టెంబర్ 18 (ప్రజా గళం)**బోధన్ పట్టణంలోని రామ మందిర్ వెనకలో గల గణేష్ మండలి వద్ద శుక్రవారం నిర్వహించిన అన్నప్రసాద విత రణ కార్యక్రమంలో నాలుగవ వార్డు కౌన్సిలర్ అబ్దుల్ సమీనామన్నాన్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా కౌన్సిలర్ అబ్దుల్ సమీనా మన్నాన్ ప్రజలతో మమేకమై,అన్న దాన కార్యక్రమంలో స్వయంగా పాల్గొని భక్తులకు స్థాని కులకు భోజనం అందించారు. పదవి కోసం కాదు,ప్రజ లతో కలిసి సేవ చేయడమే లక్ష్యం!ప్రజల అవసరాల్లో ముందుండి,సేవా కార్యక్రమాల్లో భాగస్వామ్యం అవు తూ..ప్రజల మధ్యే,ప్రజల కోసం,ప్రజాసేవలోనే!ఉంటూ అన్నదానం మహాదానం సేవే నిజమైన బలం అని పలు కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు..

# బంజారా జాతి అభ్యున్నతికి కలిసికట్టుగా పోరాడుదాం

**- మైదాన ప్రాంత గిరిజనులకు చట్టసభల్లో ప్రాధాన్యత కల్పించాలి**

**- గిరిజన నేత మాజీ మంత్రి రవీందర్ నాయక్**

**నిజామాబాద్ సిటీ సెప్టెంబర్ 18 ( ప్రజాగళం)**బంజారా జాతి అభ్యున్నతికి బంజారా లు ఐక్యంగా పోరాడాల్సిన సమయం ఆసన్నమైందని గిరిజన నేత మాజీ మంత్రి రవీందర్ నాయక్ పిలుపునిచ్చారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని ఆర్ అండ్ బి అతిథి గృహంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బంజారా జాతి ఎస్టీలుగా గుర్తింపు పొంది 50 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమానికి తనను ముఖ్యఅతిథిగా ఆహ్వానించడం ఎంతో సంతోషం కలిగిందని అన్నారు. అంబేద్కర్ రచించిన రాజ్యాంగం ప్రకారం గిరిజనులకు ఎంతో వ్యత్యాసం ఉందని కిందిస్థాయి నుండి పై స్థాయి వరకు ఉన్నత పదవులను అధిరోహిస్తున్నారని ఆయన అన్నారు. బ్రిటిష్ కాలంలో బంజారాలను నేర ప్రవృత్తి గల వ్యక్తులుగా పరిగణించాలని భారతదేశ స్వతంత్రం తర్వాత మొట్టమొదటి ప్రధానమంత్రి జవహర్లాల్ నెహ్రూ తమకు ప్రత్యేక గుర్తింపునివ్వడం అర్శించదగ్గ విషయమని కొనియాడారు. బంజారా జాతి కి ఆసియా ఖండంలోనే ఘనమైన చరిత్ర కలదని, ఆస్తి గాని ఆస్తులు గాని ఆశించకుండా ఉన్నారని 18 60వ సంవత్సరంలో బ్రిటిష్ పరిపాలనలో బంజారాల సహాయం కోరడంతో దానికి బంజారా లు ససేమిరా తమ సహాయము ఇవ్వకపోవడంతో అప్పటి బ్రిటిష్



ప్రభుత్వం వారిని నేరజాతిగా పరిగణించారని తెలిపారు. 50 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా అనేక అంశాలపై చర్చలు జరిపేమని, తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు6 శాతం మాత్రమే ఉన్నారని తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత అది కాస్త పది శాతం రిజర్వేషన్ అయిందని, ప్రధానమంత్రి ఇందిరాగాంధీ బంజారా జాతిని ఆరోజు గుర్తించిందని ఈరోజు సోనియాగాంధీ తెలంగాణ రాష్ట్రాన్ని ఇచ్చి బంజారాలకు ప్రత్యేక స్థానం రాష్ట్రంలో కల్పించిందని అన్నారు. సేవాలాల్ మహారాజ్ మందిరాన్ని అచ్చంపేటలో నిర్మించడానికి ప్రభుత్వం 150 కోట్లు మంజూరు చేయడం జరిగిందని, అన్నారు. ఆ విధంగా బంజారా లు అభివృద్ధిలో ముందుకు సాగుతున్నామని తెలిపారు. అదేవిధంగా తండాలలో గిరిజనులకు ఎలాంటి సౌకర్యం లేనందున గిరిజన రెవిన్యూ తాండగా మార్చాలని ఆయన కోరారు. 50 సంవత్సరాలు పురస్కరించుకున్న సందర్భంగా నిజామాబాద్ జిల్లా నుండి బంజారా భారత్ స్లోగన్ ని ప్రారంభించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బంజారా ప్రతినిధులు శివలాల్ బాబురావు డాక్టర్ బిలోజి నాయక్, హరి సింగ్ బంజారా విశ్రాంత ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

# నిజామాబాద్ స్టార్ హెల్త్ సెంటర్ లో ఉచిత ఆరోగ్య సేవలు

**నిజామాబాద్ సిటీ,సెప్టెంబర్ 18( ప్రజాగళం )**జిల్లా కేంద్రంలోని స్టార్ హెల్త్ సెంటర్ లో ఉచిత ఆరోగ్య సేవలందిస్తున్నామని తెలంగాణ, ఆంధ్రప్రదేశ్,ఛత్తీస్ ఘడ్ స్టార్ హెల్త్ అండ్ అలైడ్ ఇన్సూరెన్స్ బిజినెస్ హెడ్ శ్రీనివాస్ పేర్కొన్నారు.శుక్రవారం జిల్లా కేంద్రంలోని ప్రగతి నగర్ లో నూతనంగా ఏర్పాటుచేసిన సంస్థ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ డాక్టర్ కన్సల్టేషన్లు, ప్రాథమిక ఆరోగ్య పరీక్షలు, ఔషధాలు, హెల్త్ కౌన్సెలింగ్ టీకాల పరమైన మద్దతును సంస్థ కార్యాలయంలో ఉచితంగా అందజేస్తున్నామన్నారు.జిల్లా కేంద్రంలో సంస్థ ఆరోగ్య సేవా కేంద్రం ప్రారంభించినప్పటికీ నుంచి 3,800 మందికి పైగా ప్రజలు సందర్శించారన్నారు. సగటున రోజుకు 15 పైచిలుకు విజిట్స్ నమోదవుతున్నాయన్నారు. స్థానికులు సకాలంలో కన్సల్టేషన్లు, ప్రాథమిక పరీక్షలు, ఔషధాలు తదుపరి మద్దతును పొందేలా ఇక్కడి వైద్యులు సిబ్బంది కృషి చేస్తున్నారన్నారు.ఎక్కువగా మధుమేహం.. హైపర్టెన్షన్ నిజామాబాద్ ఆరోగ్య సేవా కేంద్రంలోని డాక్టర్లు ఇచ్చిన వివరాల ప్రకారం ఈ కేంద్రాన్ని తరచుగా సందర్శించే వారిలో 40 నుంచి 80 ఏళ్ల వారు ఎక్కువగా ఉంటున్నారని శ్రీనివాస్ పేర్కొన్నారు. అత్యధికంగా హైపర్టెన్షన్, జ్వరం, మధుమేహంలాంటి ఆరోగ్య సమస్యలకు వైద్య సహాయం తీసుకుంటున్నారన్నారు. ఇప్పటివరకు ఈ సెంటర్లో 1,900మందికి పైగా మధుమేహం పరీక్షలు, 2,700 మందికి పైగా




రోగులకు హైపర్టెన్షన్ పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు.స్టార్ హెల్త్ ప్రస్తుతం తమ సీఎస్ఆర్ పోర్ట్ఫోలియో కింద నిజామాబాద్, ఖమ్మం, కరీంనగర్, మహబూబ్ నగర్ లో మొత్తం నాలుగు ఆరోగ్య సేవా కేంద్రాలను ప్రారంభించామన్నారు.నిజామాబాద్ క్లినిక్‌లో ఒక డాక్టరు, నర్సు, సహాయక సిబ్బంది ఉంటారన్నారు.హెమోగ్లోబిన్ టెస్టింగ్, ర్యాండమ్ బ్లడ్ షుగర్ టెస్టింగ్, షుగర్, అల్బుమిన్‌కి సంబంధించి మూత్ర పరీక్షలు, మలేరియాకి సంబంధించి ర్యాపిడ్ డయాగ్నోస్టిక్ టెస్టింగ్ మొదలైన సర్వీసులను ఇది అందిస్తుందన్నారు.ఈ కార్యక్రమంలో స్టార్ హెల్త్ అండ్ అలైడ్ ఇన్సూరెన్స్ బిజినెస్ హెడ్, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ అండ్ ఛత్తీస్‌గఢ్ శ్రీనివాస్ కేబీబీ, తెలంగాణ రీజినల్ హెడ్ సురేష్, ఆరోగ్య సేవా కేంద్రం క్లినిక్ డాక్టర్ డా. సాయి చరణ్, స్టార్ హెల్త్ ఇన్సూరెన్స్ పీఆర్ఓ తేజస్వి బండారి పాల్గొన్నారు.

# ఎడపల్లి గ్రామంలో తాళం వేసిన రెండు ఇండ్లలో చోరీ...

**- బంగారు,వెండి నగలు ఎత్తుకెళ్లిన గుర్తు తెలియని దుం డగులు....ఎస్ఐ ముత్యాల రమ వెల్లడి....**

**ఎడపల్లి,సెప్టెంబర్ 18:** (ప్రజా గళం)ఎడపల్లి మండలం కేంద్రంలోని సాయి కృప నగర్ కాలనీలో తాళం వేసిన ఓ ఇంట్లో గుర్తుతెలియని దుండగులు పాల్పడ్డారు.ఎడపల్లి ఎస్ఐ ముత్యాల రమ తెలిపిన వివరాలు ప్రకారం..ఎడపల్లి గ్రామంలోని సాయి కృపానగర్ కాలనీలో నివసిస్తున్న నాజియా బేగం అనే మహిళా ఈ నెల 11 న సాయంత్రం ఇంటికి తాళం వేసి రెంజల్ మండలం నీలా పేపర్ మిల్ గ్రామం లో ఉంటున్న తన తల్లిగారి ఇంటికి వెళ్ళింది.అలాగే నాజియా బేగం ఇంట్లో కిరాయికి ఉంటున్న సయ్యద్ మాజీద్ ఇంటి తాళం కూడా దుండగులు పగుల గొట్టి ఇరువురి ఇంట్లోకి ప్రవేశించారు.ఇంట్లోని బీరువా తాళాలు పగుల గొట్టి బట్టలు చిందరగా వందరగా పడేశారు.బంగారు,వెండి నగలు దొంగిలించుకుపోయా రు.17 వ తేదీ రాత్రి 10 గంటల ప్రాంతంలో అద్దెకు ఉండే సయ్యద్ మాజీద్ ఇంటికి వచ్చి చూడగా రెండు ఇండ్లు తాళాలు పగుల గొట్టి ఉన్నాయి.ఇంట్లో బీరువా తాళాలు కూడా పగుల గొట్టి ఉండటాన్ని గమనించిన సయ్యద్ మాజీద్ వెంటనే ఇంటి యజమాని నాజియా బేగం కు ఫోన్ చేసి సచారం ఇచ్చారు.శుక్రవారం నాజి యా బేగం పోలీస్ స్టేషన్ కు వచ్చి ఫిర్యాదు చేశారాని ఎస్ఐ తెలిపారు.సంఘటన స్థలానికి వెళ్లి పరిశీలించగా నాజీయా బేగం ఇంట్లోని బీరువాలో పెట్టుకున్న 7 గ్రాం: ల బంగారు గొలుసు,5



గ్రాం:ల చేతి ఉంగరాలు చిన్నవి,దొంగిలించగా,ఆమె ఇంట్లో కిరాయికి ఉండే సయ్యద్ మాజిద్ ఇంట్లోని బీరువాలో నుండి 7 గ్రాం:ల చేతి బంగారు ఉంగరాలు,5 గ్రాములు బంగారు చెవి కమ్మ లు,24 తులాలు వెండి పట్టగొలుసులు గుర్తు తెలియని దొంగలు దొంగలించుకోపోయినారని బాధితులు తెలిపా రు.వాటి మొత్తం విలువ 50 వేల రూపాయలు వరకు ఉంటుందని, బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రమ తెలిపారు.

# బోధన్ జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు,ప్రసావాల కోసం వచ్చే గర్భిణీ మహిళలకు మెరుగైన వైద్యం అం దించాలి...

**బోధన్ ఆర్డీవో విజయ కుమారి ఆదేశం... ఆసుపత్రిలో వైద్యులతో సమీక్ష సమావేశం నిర్వహిం చిన ఆర్డీవో....ఆసుపత్రిలో పారిశుధ్య నిర్వహణకు ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వాలి....వైద్య సిబ్బందికి ఆర్డీవో సూచన....**

**బోధన్ ప్రతినిధి,సెప్టెంబర్ 18:** (ప్రజా గళం)జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా ఆదేశాల మేరకు బోధన్ జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో పక్షం రోజుల సమీక్ష సమావేశాన్ని శుక్రవారం నిర్వహించారు.ఆస్పత్రి ప్రాంగణంలో జరిగిన ఈ సమావేశానికి బోధన్ ఆర్డీఓ ఎం.విజయ కుమారి హాజరై ఆస్పత్రి సూపరింటెండెంట్ రాహుల్‌తో కలిసి వివిధ అంశాలపై సమీక్షించారు.ఈ సందర్భంగా ఆస్పత్రి లో పారిశుధ్య నిర్వహణ,రోగులకు అందుతున్న వైద్య సేవలు,ప్రసవాల నిర్వహణ,తల్లి--శిశు సంరక్షణ, అత్యవసర వైద్య సేవలు తదితర అంశాలపై వివరాలు తెలుసుకున్నారు.ఆస్పత్రిలో రోగులకు ఎలాంటి ఇబ్బం దులు కలగకుండా పరిశుభ్రమైన వాతావరణాన్ని కల్పిం చాలని అధికారులకు సూచించారు.అలాగే ప్రసవాల కోసం ఆస్పత్రికి వచ్చే గర్భిణులకు అవసరమైన వైద్య సేవలు సకాలంలో అందేలా చర్యలు తీసుకోవాలని ఆర్డీఓ



సూచించారు.వైద్యులు,సిబ్బంది విధులకు సక్ర మంగా హాజరై రోగులకు మెరుగైన సేవలు అందించాల ని ఆర్డీవో ఆదేశించారు.ఆస్పత్రిలో అందుబాటులో ఉన్న సౌకర్యాలు,సిబ్బంది పనితీరు,పెండింగ్‌లో ఉన్న సమస్యలను ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ పరిష్కరించా లని ఆమె ఆదేశించారు.ప్రభుత్వ ఆస్పత్రులపై ప్రజల్లో నమ్మకం పెరిగేలా వైద్య సేవల నాణ్యతను మెరుగుప రచడంతో పాటు,పరిశుభ్రతకు ప్రత్యేక ప్రాధాన్యం ఇవ్వాలని విజయ కుమారి సూచించారు.ఈ సమావే శంలో ఆస్పత్రి సూపరింటెండెంట్ రాహుల్,వైద్యులు, వైద్య సిబ్బంది,సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రమాదవశాత్తు తుపాకి పేలి ఆర్ఐ మృతి

**- మృతదేహంపై పుష్పగుచ్ఛం ఉంచి, నివాళులర్పించిన సీపీ సాయి చైతన్య**



**నిజామాబాద్ క్రైమ్ సెప్టెంబర్ 18 (ప్రజాగళం )**నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని పోలీస్ హెడ్ క్వార్టర్ లో శుక్రవారం విషాదకర సంఘటన చోటు చేసుకుంది. నిజామాబాద్ పోలీస్ హెడ్ క్వార్టర్స్ లో ఎన్.ఎస్.ఓ శుక్రవారం ఉదయం డ్యూటీ ముగించుకొని వచ్చిన తర్వాత సమయంలో ఆయుధం క్లీన్ చేసే సమయంలో ప్రమాదవశాత్తు మిస్ఫైర్ కావడంతో రిజర్వ్ ఇన్స్పెక్టర్ హెచ్. సతీష్(41) మృతి చెందారు. సంఘటన స్థలాన్ని హుటాహుటిన నిజామాబాద్ పోలీస్ కమిషనర్ సాయి చైతన్య పర్యవేక్షించారు.నిజామాబాద్ పోలీస్ హెడ్ క్వార్టర్స్ లో ఎన్.ఎస్.ఓ (నైట్ సెక్యూరిటీ ఆఫీసర్) డ్యూటీ ముగించుకొని వచ్చిన తర్వాత ఉదయం సమయంలో ఆయుధం క్లీన్ చేసే సమయంలో ప్రమాదవశాత్తు మిస్ఫైర్ కావడం వల్లన రిజర్వ్ ఇన్స్పెక్టర్ హెచ్. సతీష్ (41) మరణించడం జరిగింది. సంఘటన స్థలాన్ని నిజామాబాద్



పోలీస్ కమిషనర్ సాయి చైతన్య పర్యవేక్షించారు.అనంతరం నిజామాబాద్ ప్రభుత్వ హాస్పిటల్ లో పోస్టుమార్టం అనంతరం పోలీస్ కమీషనర్ పుష్ప గుచ్ఛం ఉంచి ఘనంగా నివాళులుఅర్పించారు. నివాళులు అర్పించిన వారిలో అదనపు డీసీపీ అడ్మిన్ శుభం ప్రకాష్ , నిజామాబాద్ ఏసిపి ప్రకాష్ , ఆర్మూర్ ఎసిపి వెంకటేశ్వర్ రెడ్డి , బోధన్ ఎసిపి శ్రీనివాసులు , ఏ.ఆర్ ఏ సి పి కృష్ణ స్వామి , సి.సి.ఎస్ ఏ సి పి శ్రీశైలం , టాస్క్ ఫోర్స్ ఎ.సి.పి నరేందర్ , సి.టి.సి ఎ సి పి రాజశేఖర్ , స్పెషల్ బ్రాంచ్ ఇన్స్పెక్టర్లు శ్రీధర్ రెడ్డి , మల్లేశం, సిఐలు , రిజర్వ్ ఇన్స్పెక్టర్లు , ఎస్.ఐ లు , ఆర్ఎస్ఐలు , పోలీస్ అసోసియేషన్ అధ్యక్షులు శ్రీను , పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.నివాళుల అనంతరము ప్రత్యేక అంబులెన్స్ లో తన స్వస్థలం ఖమ్మం జిల్లా ఇల్లెందు మండలంకు తరలించారు.

# ఏఆర్పీ క్యాంప్ గ్రామంలో దుర్గా మాత నూతన ఉత్సవ కమిటీ అధ్యక్షుడుగా బండారి నర్సింలు ఎన్నిక....

**ఎడపల్లి,సెప్టెంబర్ 18:** (ప్రజా గళం)ఎడపల్లి మండలం ఏఆర్పీ క్యాంప్ గ్రామంలోని దుర్గ మాత ఉత్సవ కమిటీ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకు న్నారు.దుర్గాదేవి ఉత్సవ కమిటీ ఈమెరకు శుక్రవారం ఒకపత్రిక ప్రకటన విడుదల చేశారు.గౌరవ అధ్యక్షులు గా పూల భోజరాజు, రాంగోపాల్,రాయపాటి సురేష్, రాడం శ్రీనివాస్,విశ్వనాథం,లను ఎన్నుకున్నారు. అధ్యక్షుడుగా బండారి నర్సింలు,ఉపాధ్యక్షులుగా డొక్క ఆశీర్వాదం,పురామల్ల వినోద్,పాకాల సతీష్, శ్రీనివాస్ గౌడ్ లు ఎన్నుకున్నారు.అలాగే ప్రధాన కార్యద ర్శిగా జంగం ఎల్లయ్య,క్యాషియర్ గా ఔదారి రంజిత్, జాయింట్ క్యాషియర్లు గా అరవింద్ గౌడ్,ఏగొండ, గికూరు శ్రీనివాస్,జాయింట్ సెక్రెటరీలుగా నరేందర్, నాగేందర్,ప్రవీణ్, గౌతమ్,వీర స్వామి,బండారి కృష్ణ, సాంస్కృతిక




నిర్వాహక సభ్యులు రాంగోపాల్,తోట వెంకటేష్ ,కన్నా,ఎలక్ట్రిషన్ లుగా వరి రాంచందర్, నాగేష్,శ్రీధర్ ,మల్లిఖార్జున్,బొమ్మర వేణి,ప్రచార కార్య నిర్వహణ పోతన్నపల్లి ప్రకాష్,ప్రేమ్ కుమార్,దేవరాజు, కార్యనిర్వహణ సభ్యులుగా ముద్దం శ్రీనివాస్ గౌడ్, విలాస్,ల్యాంగల సంతోష్ లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యా రు.ఈ సందర్భంగా ఉత్సవ కమిటీ అధ్యక్షుడు బండా రి నర్సింలు మాట్లాడుతూ. .దుర్గా మాత నవరాత్రి ఉత్సవాలు అత్యంత వైభవంగా నిర్వహించేందుకు ఉత్సవ కమిటిని నియమించడం జరిగిందని తెలిపా రు.కమిటీ సభ్యులు అంకితభావంతో,భక్తి శ్రద్దలతో దుర్గా దేవి ఉత్సవాలు నిర్వహిస్తామని,భాద్యతలు అప్పగించినందున ఇందుకు అందరు కలిసి కట్టుగా పనిచేస్తామని కమిటీ అధ్యక్షుడు బండారి నర్సింలు తెలిపారు.

# నివా బుపాపై ఐఆర్‌డీఏఐ వేటు...!




ప్రముఖ ఆరోగ్య బీమా సంస్థ 'నివా బుపా హెల్త్ ఇన్సూరెన్స్'కు బీమా నియంత్రణ మండలి 'ఐఆర్‌డీఏఐ' షాక్ ఇచ్చింది. రాబోయే ఆరు నెలల పాటు దేశవ్యాప్తంగా ఎలాంటి కొత్త బ్రాంచులు ప్రారంభించవద్దని కఠిన ఆదేశాలు జారీ చేసినట్లు కంపెనీ వెల్లడించింది. ఐఆర్‌డీఏఐ
ఇచ్చిన ఆదేశాలను నిశితంగా పరిశీలిస్తున్నామని, తమ వాటాదారుల ప్రయోజనాలను కాపాడేందుకు అవసరమైన అన్ని చట్టపరమైన, వ్యాపారపరమైన చర్యలు తీసుకుంటామని కంపెనీ స్టాక్ ఎక్స్ఛేంజ్ ఫైలింగ్‌లో వివరించింది.
అయితే, కంపెనీ నడపడానికి ఐఆర్‌డీఏఐ ఎంతవరకు ఖర్చు చేయవచ్చని పరిమితి విధించిందో, 2024-25లో నివా బుపా ఆ హద్దులు దాటి ఎక్కువగా ఖర్చు చేసింది. అందుకే ఐఆర్‌డీఏఐ ఈ చర్యలు తీసుకుంది. కానీ, 2025-26 ఆర్థిక సంవత్సరంలోనూ, ఈ ఏడాది మొదటి త్రైమాసికంలోనూ (ఏప్రిల్-జూన్) తాము ఐఆర్‌డీఏఐ ఖర్చుల నిబంధనలను కచ్చితంగా పాటించామని కంపెనీ స్పష్టం చేసింది. ఇకపై కూడా ఈ నిబంధనలు దాటకుండా జాగ్రత్తగా ఉంటామని పేర్కొంది. ఈ పరిణామంతో స్టాక్ మార్కెట్ ట్రేడింగ్‌లో కంపెనీ షేర్ ధరపై ప్రభావం కనిపించింది. బీఎస్ఈలో నివా బుపా షేర్ ధర దాదాపు 2 శాతం క్షీణించి రూ. 82.61 వద్ద ముగిసింది.ఐఆర్‌డీఏఐ ఇచ్చిన ఆదేశాలను నిశితంగా పరిశీలిస్తున్నామని, తమ వాటాదారుల ప్రయోజనాలను కాపాడేందుకు అవసరమైన అన్ని చట్టపరమైన, వ్యాపారపరమైన చర్యలు తీసుకుంటామని కంపెనీ స్టాక్ ఎక్స్ఛేంజ్ ఫైలింగ్‌లో వివరించింది.

# ఎల్‌పీజీ సరఫరాకు మరో దారి..!



వంట గ్యాస్ (ఎల్పీజీ) సరఫరాలో ఎలాంటి అంతరాయాలు కలగకుండా చూసేందుకు దేశీయ అతిపెద్ద ఇంధన సంస్థ 'ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్' (ఐఓసీ) కీలక అడుగు వేసింది. పశ్చిమాసియా దేశాలపైనే పూర్తిగా ఆధారపడటాన్ని తగ్గిస్తూ, అల్జీరియా ప్రభుత్వ రంగ సంస్థ 'సోనాట్రాచ్'తో 2027 నుండి ఎల్పీజీని దిగుమతి చేసుకునేందుకు దీర్ఘ కాలపరిమితి ఒప్పందాన్ని ఖరారు చేసే పనిలో ఉంది. ఈ ఒప్పందం ప్రకారం, ప్రొపేన్, బ్యూటేన్ మిశ్రమంతో కూడిన 45,000 నుండి 55,000 మెట్రిక్ టన్నుల ఎల్‌పీజీని ప్రతి నెలా భారీ షిప్పుల ద్వారా ఐఓసీ భారత్‌కు తరలిస్తుంది.
గతంలో సౌదీ అరామ్‌కో వంటి మధ్యప్రాచ్య సంస్థల నుండి కొనుగోలు చేసినప్పటికీ, అల్జీరియన్ ఎల్‌పీజీ ధర చాలా తక్కువగా ఉండటం ఐఓసీకి కలిసిరానుంది. ఇప్పటికే జూన్ నుండి అల్జీరియా గ్యాస్ దిగుమతిని ప్రారంభించిన భారత్, ఆగస్టులో దాదాపు 1.10 లక్షల టన్నులను అందుకోనుంది. హోర్ముజ్ జలసంధి వద్ద యుద్ధ పరిస్థితులు, రవాణా ముప్పు వల్ల దేశీయంగా ఎల్‌పీజీ కొరత రాకుండా ఉండేందుకు కేంద్రం సరఫరాదారుల పరిధిని విస్తరిస్తోంది. ఇందులో భాగంగానే 2027 నాటికి మనదేశ మొత్తం ఎల్‌పీజీ దిగుమతుల్లో 25 శాతం ఒక్క అమెరికా నుంచే పొందేందుకు ఐఓసీ, హెచ్‌పీసీఎల్, బీపీసీఎల్ సంస్థలు ఉమ్మడిగా టెండర్లు పిలవనున్నాయి.
ఒకవైపు పైపుల ద్వారా సరఫరా చేసే సహజ వాయువును ప్రోత్సహిస్తూనే, మరోవైపు అల్జీరియా, అమెరికా వంటి ప్రత్యామ్నాయ దేశాలతో ఒప్పందాలు కుదుర్చుకోవడం ద్వారా దేశంలో కోట్లాది ఇళ్లకు అవసరమైన వంట ఇంధన భద్రతను భారత్ బలోపేతం చేసుకుంటోంది.

# 40 ట్రిలియన్ డాలర్లు చేరిన అమెరికా అప్పు...




అమెరికా ఆర్థికవ్యవస్థపై అప్పుల భారం మునుపెన్నడూ లేనంత స్థాయికి చేరింది. ఆ దేశ జాతీయ అప్పు చరిత్రలోనే తొలిసారిగా 40 ట్రిలియన్ డాలర్ల మార్కును దాటినట్లు ట్రెజరీ డిపార్ట్‌మెంట్ అధికారికంగా వెల్లడించింది. రాబడికి మించి విపరీతంగా పెరిగిపోతున్న ప్రభుత్వ ఖర్చులు, పన్ను కోతలు, వడ్డీ భారం వల్ల తీవ్రమైన ఆర్థిక సంక్షోభం ముంచుకొస్తోందని విశ్లేషకులు హెచ్చరిస్తున్నారు. అమెరికా ప్రభుత్వం వసూలు చేసే పన్నుల కంటే ఖర్చులే ఎక్కువగా ఉండటంతో ప్రతి ఏటా బడ్జెట్ లోటు పెరిగిపోతోంది. ప్రధానంగా వృద్ధాప్య జనాభా పెరగడం వల్ల సోషల్ సెక్యూరిటీ, మెడికేర్ వంటి సంక్షేమ పథకాల వ్యయం విపరీతంగా పెరిగింది.
దీనికి తోడు రక్షణ రంగానికి చేసే భారీ కేటాయింపులు, ట్రంప్ పాలనలోని పన్ను కోతల చట్టాలు ప్రభుత్వం వచ్చే ఆదాయాన్ని తగ్గించి, లోటును మరింత పెంచాయి. కాంగ్రెషనల్ బడ్జెట్ ఆఫీస్ (సీబీఓ) అంచనా ప్రకారం, 2026 నాటికి అమెరికా బడ్జెట్ లోటు 1.9 ట్రిలియన్ డాలర్లకు చేరనుంది. ప్రస్తుతం పాత అప్పులు తీర్చడానికి, వడ్డీలు చెల్లించడానికే అమెరికా మళ్లీ కొత్తగా అప్పులు చేయాల్సిన క్లిష్ట పరిస్థితి ఏర్పడింది. 2026 మొదటి 10 నెలల్లోనే నికర వడ్డీ చెల్లింపులు 963 బిలియన్ డాలర్లకు చేరాయి. ఇది అమెరికా జాతీయ రక్షణ బడ్జెట్ కంటే కూడా ఎక్కువ కావడం గమనార్హం.
గ్లోబల్ మార్కెట్‌లో డాలర్ ఆధిపత్యం వల్ల ప్రస్తుతానికి నిలదొక్కుకుంటున్నప్పటికీ, పెరిగిన వడ్డీ రేట్ల వల్ల ప్రభుత్వం కొత్తగా రుణాలు సేకరించడం మరింత ఖరీదైన విషయంగా మారింది. ఇది అమెరికా వెంటనే డిఫాల్ట్ అవుతుందని అర్థం కాకపోయినా, రుణ భారం వేగంగా పెరిగితే పెట్టుబడిదారులు అధిక రాబడులు డిమాండ్ చేసి, ఆర్థిక వ్యవస్థపై రుణ భారాలను మోపే ప్రమాదముందని విశ్లేషకులు వెల్లడిస్తున్నారు.

# పాతబస్తీకి నెరవేరనున్న మెట్రో కల


భాగ్యనగరంలోని పాతబస్తీ పుర వీధుల్లో పర్యటిస్తుంటే ఆసక్తికరమైన ఫ్లెక్సీలు కనిపిస్తుంటాయి. మూసీ నది దాటిన తర్వాత చారిత్రాత్మకమైన పాతబస్తీలో మెట్రో రైలు పనుల్లో భాగంగా కూలుస్తున్న నిర్మాణాల ముందు 'ఓల్డ్ సిటీ అంటే ఒరిజినల్ సిటీ' అంటూ పోస్టర్లలో కనిపించే నినాదాలు కార్యరూపం దాలుస్తున్నాయని స్థానికులు భావిస్తున్నారు. ప్రభుత్వం న్యూ సిటీతో పాటు ఒరిజినల్ ఓల్డ్ సిటీకి కూడా సమ ప్రాధాన్యతిస్తుందనే విశ్వాసం అక్కడి ప్రజల్లో కలుగుతోంది. నగరం నలువైపులా ఉన్న మెట్రో రైలును పాతబస్తీలో కూడా విస్తరింపచేసేందుకు పనులు వేగవంతం చేయాలని, భూసేకరణ వేగవంతం చేసి, త్వరలో టెండర్ ప్రక్రియ ప్రారంభించాలని సిఎం రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించడంతో ఒరిజినల్ సిటీకి గుర్తింపు లభిస్తుందనే భరోసా పాతబస్తీ వాసుల్లో కలుగుతోంది. హైదరాబాద్ అభివృద్ధి కథలో పాతబస్తీకి మెట్రో రైలు అనుసంధానం చాలా కాలంగా అసంపూర్తిగా ఉన్న అధ్యాయం. గ్రేటర్‌లోని ఇతర ప్రాంతాల్లో మెట్రో పరుగులు తీస్తున్నా నగరంలో దాదాపు 25 శాతానికిపైగా జనాభా నివసించే పాతబస్తీలో మాత్రం మెట్రో అందుబాటులో లేకపోవడం పెద్ద లోటుగా మారింది.
నగరంలో రవాణా సౌకర్యాలను మెరుగుపర్చడంలో భాగంగా 2012లో మూడు మార్గాల్లో మెట్రో రైలు పనులు ప్రారంభమైనా వాటిలో జెబిఎస్ ఫలక్‌నుమా కారిడార్ అసంపూర్తిగా మిగిలిపోవడంతో పాతబస్తీ ప్రజల్లో తీవ్ర అసంతృప్తి నెలకొంది. ఈ మార్గంలో ఎంజిబిఎస్ వరకు పనులు పూర్తయినా, అక్కడి నుంచి ఫలక్‌నుమా వరకు ఉన్న పాతబస్తీ భాగం మాత్రం అనేక కారణాలతో పెండింగ్‌లో ఉండిపోయాయి. పాతబస్తీ మెట్రో ఆలస్యానికి సాంకేతిక సమస్యలే కాకుండా సామాజిక, రాజకీయ సున్నితత్వం కూడా కారణమైంది. ఇక్కడి ఇరుకైన రహదారులు, భారీగా ఉన్న ఆస్తులు, మతపరమైన, వారసత్వ కట్టడాలు, భూసేకరణ వంటి సమస్యలతోపాటు స్థానిక రాజకీయ ఆధిపత్య
ధోరణులు కూడా అడ్డంకిగా నిలిచాయి. పాతబస్తీలో 103 మతపరమైన కట్టడాలు ఉన్నాయని, వాటి పరిరక్షణను దృష్టిలో పెట్టుకుని మెట్రో మార్గాన్ని రూపొందించాల్సి వస్తుందని 2018లో నాటి ప్రభుత్వం వెల్లడించి చేతులు దులుపుకుంది. ఈ నిర్మాణాల్లో 21 మసీదులు, 12 ఆలయాలు, 12 ఆషూర్ఖానాలు, 33 దర్గాలు, 7 శ్మశాన/ సమాధి ప్రాంతాలు, 6 చిల్లాలు తదితర సున్నిత ప్రాంతాలు ఉన్నాయి.
ఇలాంటి పరిస్థితుల్లో మెట్రో స్తంభాలు, వయాడక్ట్ ఎత్తు, వంపులు, స్టేషన్ ప్రాంతాల రూపకల్పనలో మార్పులు చేస్తూ వీలైనంత వరకు మతపరమైన, వారసత్వ కట్టడాలను కాపాడే ప్రయత్నం చేశారు. దాదాపు అన్నింటినీ కాపాడేలా ఇంజినీరింగ్ పరిష్కారాలు రూపొందించారు. ఒక దశలో ప్రభావితమయ్యే నిర్మాణాల సంఖ్యను 18కు, ఆ తర్వాత ఇప్పుడు కేవలం నాలుగుకు తగ్గించగలిగారు. పాతబస్తీ మెట్రో విషయంలో హెరిటేజ్ పరిరక్షణ అంశం కీలకంగా మారి న్యాయస్థానం జోక్యం చేసుకోవాల్సి వచ్చింది. పురావస్తు కట్టడాలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పనులు చేపడుతున్నట్టు ప్రభుత్వం ఇచ్చిన వివరణతో సంతృప్తి చెందిన హైకోర్టు నిర్మాణాల తొలగింపు పనుల నిలిపివేతకు ఆమోదించకుండా, మెట్రో నిర్మాణ పనులు కొనసాగించవచ్చని తీర్పు ఇవ్వడంతో మరింత వేగవంతంగా పనులు కొనసాగుతున్నాయి. భూసేకరణ అంశం కూడా పాతబస్తీలో పెద్ద సమస్యగా మారింది. చాలా ఆస్తులు చిన్నచిన్న వ్యాపార సంస్థలు, నివాసాలు, పాత భవనాలుగా ఉండటంతో భూసేకరణ ప్రక్రియ సులభంగా సాగలేదు. మెట్రో నిర్మాణానికి అవసరమైన రహదారి వెడల్పు, ఆస్తుల నష్టం, పరిహారం వంటి అంశాలపై స్థానికంగా ఆందోళనలు వ్యక్తమయ్యాయి. అందువల్ల రాజకీయంగా కూడా ఈ అంశం అత్యంత సున్నితంగా మారింది. ఒక ప్రభుత్వం ప్రణాళికలు ప్రకటించడం, మరో ప్రభుత్వం వాటిని పునఃసమీక్షించడం వంటి పరిణామాలతో పనులకు నిత్యం బ్రేకులు పడ్డాయి. ప్రభుత్వంలో చిత్తశుద్ధి ఉంటే పనులు పూర్తి అవుతాయని చెప్పడానికి సుల్తాన్ బజార్‌లో మెట్రో రైలు నిర్మాణమే నిదర్శనం.జెబిఎస్ ఫలక్‌నుమా మార్గంలో వ్యాపారాలకు కీలకమైన సుల్తాన్ బజార్‌లో కూడా పాతబస్తీవలే పలు అభ్యంతరాలు ఎదురైనా నాటి ప్రభుత్వం ముందుకెళ్లింది కానీ, అదే సమయంలో పాతబస్తీలో మాత్రం రాజకీయాల ఒత్తిడికి లొంగడంతో ఆ లైన్ ఎంజిబిఎస్ వరకే పరిమితమైంది. సమస్యలకు రాజకీయ రంగు పులమడం కంటే, వాటిని పరిష్కరించి పనులు పూర్తి చేయడమే ముఖ్యమన్న దిశగా ప్రస్తుత ప్రభుత్వం పాతబస్తీలో ముందుకు సాగుతుండడం ఆహ్వానించదగ్గ పరిణామం.

# స్మార్ట్‌ఫోన్ ధరలకు మళ్లీ షాక్...




స్మార్ట్‌ఫోన్ తయారీలో కీలకమైన మెమరీ, చిప్‌సెట్ ధరలు విపరీతంగా పెరగడంతో ప్రముఖ ఫోన్ కంపెనీలు తగ్గిన లాభాల కాపాడుకునేందుకు ధరలు పెంచేస్తున్నాయి. ఇప్పటికే ఆర్థికంగా ఆచి తూచి ఖర్చు చేస్తున్న వినియోగదారులకు శాంసంగ్, రియల్‌మీ, ఒప్పో, వివో, వన్‌ప్లస్ వంటి దిగ్గజ బ్రాండ్లు ఎంపిక చేసిన మోడళ్లపై భారీగా ధరలు పెంచి పెద్ద షాక్ ఇచ్చాయి. ఆగస్టు రెండో వారం తర్వాత నుంచి రియల్‌మీ రూ. 1,000 నుండి రూ. 4,000 వరకు, ఒప్పో రూ. 5,000 వరకు, అలాగే వన్‌ప్లస్ రూ. 4,000 వరకు ధరలను పెంచాయి. ఇక శాంసంగ్ ఏకంగా తమ గెలాక్సీ ఎస్25 వేరియంట్‌పై అత్యధికంగా రూ. 12,000 పెంచడం గమనార్హం. పెరిగిన ధరల వల్ల ఏప్రిల్-జూలై మధ్య స్మార్ట్‌ఫోన్ అమ్మకాలు గతేడాదితో పోలిస్తే బాగా క్షీణించాయని కౌంటర్‌పాయింట్ రీసెర్చ్ తెలిపింది. అమెజాన్ ప్రైమ్ డే, ఫ్లిప్‌కార్ట్ సేల్స్ సమయంలో కొంత అమ్మకాలు కనిపించినప్పటికీ, ఆఫర్లు ముగియగానే మళ్లీ మార్కెట్ పడిపోయింది. ఈ ఏడాది ప్రథమార్థంలోనే సగటు స్మార్ట్‌ఫోన్ ధరలు 15 శాతం పెరిగాయని, విడిభాగాల వ్యయం ఇలాగే కొనసాగితే రాబోయే నెలల్లో మరో 7-10 శాతం ధరలు పెరిగే అవకాశముందని ఐడీసీ నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఈ పరిణామాల వల్ల 2026లో భారత స్మార్ట్‌ఫోన్ మార్కెట్ దాదాపు 13 శాతం తగ్గొచ్చని అంచనా వేస్తున్నారు. అయితే రాబోయే పండుగ సీజన్లో కంపెనీలు ఇచ్చే ప్రత్యేక డిస్కౌంట్లు, నో-కాస్ట్ ఈఎంఐలు, ఫైనాన్సింగ్ ఆప్షన్లు మాత్రమే వినియోగదారులకు కొంత ఊరటనిచ్చి, మార్కెట్ పుంజుకోవడానికి సహాయపడతాయని విశ్లేషకులు భావిస్తున్నారు.

# ఒరాకిల్‌లో ఉద్యోగాల కోతలు...!




టెక్ దిగ్గజ కంపెనీలలో ఒక్కటైన ఒరాకిల్ మరోసారి ఉద్యోగాల కోతలకు సిద్ధమవుతున్నట్లు సమాచారం. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ మౌలిక సదుపాయాలపై భారీగా పెట్టుబడులు కొనసాగిస్తూనే ఉద్యోగుల వ్యయాన్ని తగ్గించేందుకు ఈ నెలలో కొత్త లేఆఫ్స్ చేపట్టాలని కంపెనీ యోచిస్తున్నట్లు ప్రముఖ నివేదిక వెల్లడించింది.బిజినెస్ ఇన్‌సైడర్ ప్రకారం.. ఒరాకిల్‌లో లేఆఫ్స్‌కు గురయ్యే ఉద్యోగులను గుర్తించాలని మేనేజర్లను కంపెనీ ఆదేశించింది. సెప్టెంబర్ 1న కంపెనీ రెండో ఆర్థిక త్రైమాసికం ప్రారంభం కానున్న నేపథ్యంలో.. అంతకంటే ముందే ఈ ఉద్యోగాల కోతలను అమలు చేసే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. కొన్ని టీమ్‌లలో ఉద్యోగుల సంఖ్య రెండంకెల శాతంలో తగ్గే అవకాశం ఉందని నివేదిక పేర్కొంది. ఈ తాజా లేఆఫ్స్‌కు ముందు కూడా ఒరాకిల్ భారీ స్థాయిలో ఉద్యోగులను తగ్గించింది. 2026 ఆర్థిక సంవత్సరంలో కంపెనీ ఉద్యోగుల సంఖ్య సుమారు 21,000 మేర తగ్గింది. ఇది కంపెనీ మొత్తం ఉద్యోగుల్లో దాదాపు 13 శాతానికి సమానం. దీంతో ఒరాకిల్‌లో ఉద్యోగుల సంఖ్య సుమారు 1,41,000కు చేరుకుంది. మరోవైపు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ రంగంలో తన స్థానాన్ని బలోపేతం చేసుకునేందుకు ఒరాకిల్ భారీగా ఖర్చు చేస్తోంది. 2026 ఆర్థిక సంవత్సరంలో ఏఐ సంబంధిత మౌలిక సదుపాయాల కోసం కంపెనీ సుమారు 55.7 బిలియన్ డాలర్లు ఖర్చు చేసినట్లు నివేదికలు చెబుతున్నాయి. ఈ పెట్టుబడులకు మద్దతుగా కంపెనీ సుమారు 43 బిలియన్ డాలర్లను అప్పుగా తీసుకున్నట్లు సమాచారం.
ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో మరో 40 బిలియన్ డాలర్లను డెట్, ఈక్విటీ ద్వారా సమీకరించాలని కూడా ఒరాకిల్ ప్రణాళికలు రూపొందించినట్లు తెలుస్తోంది. భారీగా పెట్టుబడులు పెడుతున్నప్పటికీ ఒరాకిల్ క్లౌడ్ వ్యాపారానికి డిమాండ్ కొనసాగుతోంది. ముఖ్యంగా ఏఐ కంప్యూటింగ్ సామర్థ్యానికి పెరుగుతున్న డిమాండ్ కారణంగా కంపెనీ క్లౌడ్ సేవల ఆదాయం గణనీయంగా పెరుగుతోంది.
అయితే ఏఐ మౌలిక సదుపాయాలపై కంపెనీ భారీగా చేస్తున్న ఖర్చులు పెట్టుబడిదారుల్లో ఆందోళనలకు కారణమవుతున్నాయి.

# తెలంగాణలో ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ జోరు...




ప్రముఖ బీమా సంస్థ 'ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ లైఫ్ ఇన్సూరెన్స్' తెలంగాణ మార్కెట్లో తన ఆధిపత్యాన్ని చాటుకుంటూ, 2026-27 ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికంలో టర్మ్ ప్లాన్ వ్యాపారంలో ఏకంగా 60.7 శాతం వార్షిక వృద్ధిని నమోదు చేసింది. ఈ ఏడాది మార్చి 31 నాటికి తెలంగాణలో రూ. 11,708 కోట్ల నిర్వహణ ఆస్తులు (ఏయూఎం), రూ. 1,52,016 కోట్ల మొత్తం సమ్ అస్యూర్డ్ కలిగి ఉన్న సంస్థ, రాష్ట్రంలో 6.56 లక్షలకు పైగా ప్రజలకు బీమా కవరేజీని అందిస్తోంది.
ముఖ్యంగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ), డేటా అనలిటిక్స్ వంటి ఆధునిక సాంకేతికతతో 97 శాతం సేవలను ఆన్‌లైన్‌లోనే అందిస్తూ, 99.3 శాతం క్లెయిమ్ సెటిల్మెంట్ నిష్పత్తితో కేవలం ఒక్క రోజులోనే విచారణ లేని క్లెయిమ్‌లను పరిష్కరిస్తోంది. రాష్ట్రవ్యాప్తంగా 11 సొంత బ్రాంచీలు, 3,934
పర్ట్‌నర్ బ్రాంచీలు, 6,100 మందికి పైగా అడ్వైజర్లతో విస్తృత నెట్‌వర్క్‌ను కలిగి ఉన్నామని సంస్థ తెలిపింది.

Printed, Published, and Owned by KOKKU RAVI KUMAR Editor: KOKKU RAVI KUMAR, Praja Galam Telugu Daily, C/O: Lazaras, Flat No: 206, 2nd Floor, Produturi Apartment, Road No: 11, Gangasthan Phase-2, Goopanpally, PO:Nizamabad Rs, DIST: Nizamabad, Telanagana-503003. Printed at: Swetha Offset printers, H. No: 2-10-91 & 92, Weekly Bazar, Boi gally, Nizamabad, Telanagan-503001 Email: info.krknews.ravi@gmail.com